క్లుప్తంగా

తొలిమెట్టు కార్యక్రమంపై శిక్షణ



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఉపాధ్యాయులకు తొలిమెట్టు కార్యక్రమంపై శిక్షణ తరగతులను బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా మండల విద్యాశాఖ అధికారి అనంతుల సురేందర్ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారి సూర్యనారాయణ రిసోర్స్ పర్సన్స్ మల్లయ్య, రవి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సాహితి ఆరోగ్యంపై ఆరా



ఎస్ఎస్‌తాద్వాయి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిలో రీ ఓపెన్ సర్జరీ చేసిన సాహితిని డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య బుధవారం పరామర్శించారు. కాటాపూర్ గ్రామానికి చెందిన తమ్మళ్ల సమ్మయ్య పెద్ద కుమార్తె సాహితి గర్భవతిగా ఉన్న సమయంలో పెద్ద ఆపరేషన్ చేశారు. సాహితికి కుట్లలో నుంచి చీము వచ్చి ఇబ్బంది పడడంతో వైద్య పరీక్షలు చేయించుకున్నా నయం కాలేదు. దీంతో మళ్లీ సాహితికి వైద్యులు రీ ఆపరేషన్ చేశారు. డీఎంహెచ్ఓ అప్పయ్య సాహితి ఆరోగ్యాన్ని పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రతలపై సలహాలు సూచనలు చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ఎస్ఎస్‌తాద్వాయి: మండలంలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన కొప్పుల దలిత్ (15) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఈనేపథ్యంలో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సీతక్క స్థానిక నాయకులతో కలిసి బుధవారం పరామర్శించి దలిత్ మృతదేహానికి నివాళులర్పించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి పరామర్శించి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తాటి కృష్ణ, మండల అధ్యక్షుడు మల్లెల రాంబాబులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

మందుల పంపిణీ



మంగపేట: మండలంలోని బ్రాహ్మణపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారి కారం నిఖిల్‌కుమార్ ఆధ్వర్యంలో హరితహారం, క్షయవ్యాధి గ్రస్తులకు మందుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేందర్, పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం క్షయవ్యాధిగ్రస్తులకు మందులను అందచేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జయశ్రీ, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంట పొలాల పరిశీలన



మల్హర్: మండలంలోని వల్లెకుంట, శాలపల్లి, పీవీనగర్ గ్రామాల్లో వరదల కారణంగా నష్టపోయిన పంటలు, ఇసుక మేటలు వేసిన పొలాలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, కాటారం పీఏసీఎస్ చైర్మన్ చల్లా నారాయణరెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంట పొలాలు నష్టపోయిన వివరాలను కలెక్టర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, న్యాయం జరిగేలా చూస్తామని హామీనిచ్చారు. అన్ని విధాలుగా నష్టపోయిన కుటుంబాలను సీఎం కేసీఆర్, ప్రభుత్వం ఆదుకుంటుందని, అధైర్య పడొద్దని భరోసా కల్పించారు.

వరద బాధితులకు చేయూత

ఏటూరునాగారం: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు కొండాయి, పరిసర గ్రామాల్లో నిరాశ్రయులైన వరద బాధితులకు ఏటూరునాగారం ప్రభుత్వ ఆర్‌ఐటీఐ ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఐటీడీఏ పీఓ అంకిత్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుమారు 120 కుటుంబాలకు, రూ.50 వేల విలువైన దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, ఏఓ రఘు, సర్పంచ్ ఈసం రామ్మూర్తి, కళాశాల సూపరిండెంటెంట్ కుమారస్వామి, అధ్యాపకులు ఎండీ సాదిక్, విక్రమ్, పాపారావు, నరేష్, కొండల్, రిజ్వానా బేగం, శ్రీనివాస్, కృష్ణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో..

నిరాశ్రయులైన ఎలిశెట్టిపల్లి బాధితులకు రెడ్ క్రాస్ చేయూతగా నిలిచింది. కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు ములుగు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఎ.అప్పయ్య ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని చెల్పాక ఆశ్రమ పాఠశాల పునరావాస కేంద్రంలో ఉన్న ఎలిశెట్టిపల్లి వరద బాధితులకు వంట సామగ్రి, టార్పాలిన్ కవర్స్ అందించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ అప్పయ్య మాట్లాడుతూ ఎక్కడ ఎలాంటి విపత్తు జరిగినా రెడ్ క్రాస్ సొసైటీ ముందుండి బాధితులకు అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొత్తపల్లి ప్రసాద్‌రావు, ములుగు జిల్లా వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీనివాస్, కోశాధికారి సతీష్‌కుమార్, కార్యదర్శి చుంచు రమేష్, కొట్టె రాజిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, సారయ్య, గోవర్దన్, ఈశ్వర్ పాల్గొన్నారు.

రైల్వే కాంట్రాక్టర్ల ఆధ్వర్యంలో..

పునరావాస కేంద్రాల్లో ఉన్న కొండాయి, మల్యాల, ఎలిశెట్టిపల్లి వరద బాధితులకు ఇండియన్ రైల్వే కాంట్రాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక సాయాన్ని అందించారు. ఎనిమిది మంది దాతలు కలిసి 222 మంది బాధితులకు ఒక్కొక్కరికి రూ.3వేల చొప్పున అందజేశారు. బాధితులు భయపడొద్దని ధైర్యంగా ఉండాలన్నారు. ఆర్థిక సాయం చేసిన వారిలో కె.సురేందర్‌రావు, అఫ్సర్ రియాజ్, ఆనందరావు, జె.రఘు, ఎల్ఎన్ రెడ్డి, పీవీజీఎన్ రెడ్డి, పి.వెంకటేష్, సి.వెంకటేశ్వర్లు ఉన్నారు.

నిత్యావసరాల పంపిణీ

ఎస్ఎస్‌తాద్వాయి: మండలంలోని కొత్తూరు, ఊరట్టం గ్రామాల్లోని వరద బాధిత కుటుంబాలకు జిల్లా సేవా భారతి ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఓలం జనార్ధన్ నీలిమ, ఆకాష్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బుచ్చిలింగం సువర్ణ కేసముద్రానికి చెందిన వారు సమకూర్చిన రూ.1,500 విలువలగల నిత్యావసరాల కిట్లను 25 బాధిత కుటుంబాలకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా సేవాభారతి సేవా ప్రముఖ్ చల్లగురుగుల మల్లయ్య, బాధ్యులు సుబ్బారెడ్డి, శ్రీనివాస్, మనోహర్, మాడూరి దినేష్, బొడ రమేష్, దామరాజు సమ్మయ్య, కొత్త సుధాకర్ రెడ్డి, తిరుపతి, జనార్ధన్, మేడిపల్లి సత్యనారాయణ,గట్టు సాయికుమార్ పాల్గొన్నారు.



ఏటూరునాగారం : వరద బాధితులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఐటీడీఏ పీఓ అంకిత్



వంట సామగ్రి, టార్పాలిన్ కవర్స్ అందజేస్తున్న రెడ్ క్రాస్ ప్రతినిధులు



రైల్వే కాంట్రాక్ట్ అసోసియేషన్ బాధ్యులు



ఎస్ఎస్ తాద్వాయి: సరుకులను పంపిణీ చేస్తున్న సేవ భారతి సభ్యులు

ముంపు బాధితులకు పరిహారం అందించాలి



సరుకులను పంపిణీ చేస్తున్న నాయకులు

ఎస్ఎస్‌తాద్వాయి: వరద ముంపు బాధితులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తాటి కృష్ణ, గిరిజన మోర్చా రాష్ట్ర రీసెర్చ్ పాలసీ ఇన్‌చార్జ్ రాజునాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు జవహర్‌లల సహకారంతో జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ బలారాంనాయక్‌లు మండలంలోని కొత్తూరు, కన్నెపల్లి, ఊరట్టం, గ్రామాల్లోని వరద బాధిత కుటుంబాలకు బుధవారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. వరదలతో నష్టపోయినవారికి అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కృష్ణవేణినాయక్, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, హన్మంత రెడ్డి, శ్రీనివాస్, సిద్దబోయిన పాపరావు, ఓమ్రా, ఆలకుంట చిన్న, సాంబశివ రెడ్డి, కృష్ణాకార్ రావు, యాకూబ్ పాషా, రఘు, జ్యోతి పాల్గొన్నారు.

వరద నష్టంపై సర్వే

ఎస్ఎస్ తాద్వాయి : జంపన్నవాగు వరద ముంపునకు గురైన గ్రామాల్లో నష్టాలపై రెవెన్యూ అధికారులు బుధవారం సర్వే నిర్వహించారు. జంపన్నవాగు వరదతో మేడారం, ఊరట్టం, కన్నెపల్లి, కొత్తూరు, కాల్వపల్లి, నార్లాపూర్, వెంగళాపూర్ గ్రామాల్లో భారీగా పంట పొలాలు, ఇళ్లు దెబ్బతిన్నాయి. ఈక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు తహసీల్దార్ శ్రీనివాస్ పర్యవేక్షణలో సిబ్బంది వరద ముంపు గ్రామాల్లో సర్వే నిర్వహించి నష్టాలపై నివేదిక తయారు చేశారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సర్వేలో ఎంపీపీ వాణిశ్రీ, ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్, సర్పంచ్ శిడం బాబురావు, తదితరులు పాల్గొన్నారు.



సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

కొత్తవారికి ఆశ్రయం ఇవ్వొద్దు



వెంకటాపురం(కె): కారులో తనిఖీ చేస్తున్న సీఐ బండారి కుమార్



వాజేడు: గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై అశోక్

వెంకటాపురం(కె): మండల పరిధిలో ఏగ్రామంలోనైనా కొత్త వ్యక్తులకు ఆశ్రయం కల్పించొద్దని పోలీసులు తెలిపారు. విజయపురి కాలనీ సమీపంలోని కొత్తపల్లికి వెళ్లే రహదారి సమీపంలో బుధవారం వెంకటాపురం సీఐ బండారి కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై కొప్పుల తిరుపతి రావు, సివిల్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహించారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు నిఘాను పెంచారు. మండలానికి వచ్చి వెళ్లే వాహనాలను పూర్తిస్థాయిలో తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తుల సమాచారం సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా సీఐ కుమార్ మాట్లాడుతూ వాహనాలు నడిపే వ్యక్తులు తప్పనిసరిగా అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని అన్నారు. ఎస్సై అశోక్ బుధవారం మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో సమావేశం నిర్వహించి గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 14 సంవత్సరాలలోపు పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించాలని సూచించారు. గ్రామంలోకి కొత్త వ్యక్తులు వస్తే సమాచారాన్ని పోలీసులకు అందిచాలని సమాచారం అందించిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. గ్రామంలో సమస్యలు ఉంటే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలే తప్ప చట్టాన్ని చేతులోకి తీసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

వాజేడు: మండల పరిధిలోని మొరుమూరు కాలనీ, ఘణపురం గ్రామాల మధ్యన భద్రాచలం రహదారిపై ఎస్సై వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. ప్రతీ వాహనాన్ని సోదాలు చేయడంతో పాటు అందులోని ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొత్తవారు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని వాహన చోదకులకు చెప్పారు. వాహనాల్లో ఉన్న లగేజీని నిశితంగా పరిశీలించారు.

మొరుమూరు కాలనీ గ్రామంలో బుధవారం సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులతో కలిసి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని వాజేడు ఎస్సై వెంకటేశ్వర్‌రావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై గ్రామస్తులతో మాట్లాడారు. కొత్త వ్యక్తులకు ఆశ్రయం కల్పించొద్దని తెలిపారు. అలా ఎవరైనా వస్తే.. పోలీసులకు తెలియజేయాలని చెప్పారు.

ఉపాధ్యాయుడికి ఆర్థిక సాయం



చెక్కు అందచేస్తున్న పీఓ అంకిత్

మంగపేట: బ్రెయిన్ స్ట్రోక్, పక్షవాతంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయుడు ఆదివాసీ గిరిజన ఉద్యోగుల సంక్షేమ, సాంస్కృతిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంకిడి బుచ్చయ్యకు ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ అంకిత్ రూ.లక్ష టీఆర్ఎఫ్ నిధుల చెక్కును బుధవారం అందచేశారు. మండలంలోని కొత్తచీపురుదుబ్బ గ్రామానికి చెందిన బుచ్చయ్య మండలంలోని రాజుపేట పంచాయతీ పరిధిలోని దేవనగరం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. బుచ్చయ్యకు బ్రెయిన్ ఆపరేషన్ చేయాలని అందుకు లక్షల్లో ఖర్చు అవుతుందని చెప్పడంతో రాష్ట్ర గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొదెం కృష్ణప్రసాద్ విషయాన్ని పీఓ అంకిత్ దృష్టికి తీసుకుకెళ్లి సాయం కోరారు. స్పందించిన ఆయన రూ.లక్ష చెక్కును అందచేశారు. చెక్కు అందజేసిన పీఓ అంకిత్, సహకరించిన ఏపీఓ జనరల్ వసంతరావు, ఏఓ రఘు, అకౌంటెంట్ రాజ్‌కుమార్, సీసీ శ్రీనుకు బుచ్చయ్య కుటుంబం తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సమ్మారావు, చెంచయ్య, అంజయ్య, రవి, నాగేశ్వర్‌రావు, కృష్ణయ్య పాల్గొన్నారు.

వెంకట్రావుపల్లిలో దోమలమందు పిచికారీ

కన్నాయిగూడెం: దోమల వ్యాప్తి జరగకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని వైద్యులు అభినవ్ అన్నారు. మండలంలోని రాజన్నపేట గ్రామ పరిధిలోని వెంకట్రావుపల్లిలో స్థానిక పీహెచ్‌సీ వైద్యులు అభినవ్ ఆధ్వర్యంలో దోమల మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా అభినవ్ మాట్లాడుతూ.. దోమలు వ్యాప్తి చెందకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. దోమల వలన వ్యాధులు సోకుతాయని తెలిపారు. ఇంటి పరిసరాల్లో మురుగులేకుండా చూసుకుని, పరిశుభ్రత పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి నర్సింహారావు, హెల్త్ అసిస్టెంట్ భాస్కర్ రావు, ఫార్మసిస్ట్ గంగాధర్, ఆశాలు పాల్గొన్నారు.



దోమలమందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

బదిలీపై వెళ్తున్న ఎస్సైకి సన్మానం

మంగపేట: బదిలీపై మహబూబాబాద్ జిల్లాకు వెళ్తున్న ఎస్సై ఎస్‌కే తాహెర్‌బాబాను బీఆర్ఎస్ నాయకులు వత్సవాయి శ్రీధర్‌వర్మ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఘనంగా సన్మానించారు. ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ తోట రమేష్ హాజరై శాలువాతో సత్కరించి, పుష్ప గుచ్ఛం అందచేశారు. రెండేళ్ల కాలంలో ఆయన మండలానికి అందించిన సేవలను కొనియాడారు. మండలంలోని శనిగకుంటలో గత ఏడాది జరిగిన అగ్ని ప్రమాద సంఘటనలో సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులైన 42 గిరిజన కుటుంబాలకు ఆయన ఎంతగానో అండగా నిలిచారని గుర్తు చేశారు. బదిలీపై వెళ్లడం తమకు బాధాకరంగా ఉన్నప్పటికీ ముమ్ముందు తమ సేవలను కొనసాగిస్తూ.. ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాడబోయిన నరెందర్, రాజుయాదవ్, నర్రా శ్రీధర్, లక్ష్మణ్‌రావు, నూనె లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎస్సైని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హరితహారం లక్ష్యాన్ని అధిగమించాలి

కాటారం: తొమ్మిదో విడత హరితహారంలో భాగంగా గ్రామపంచాయతీలకు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేలా మొక్కలు నాటాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం హరితహారంపై పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో ఎంపీడీఓ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 20 వరకు గ్రామ పంచాయతీల్లో మొక్కలు నాటే ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. రైతులు తమ భూముల్లో పండ్ల తోటలు నాటుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. పండ్ల మొక్కల పెంపకం కోసం మండలానికి కలెక్టర్ వంద ఎకరాల టార్గెట్ ఇవ్వగా 30 ఎకరాల మేర రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. మిగిలిన 70 ఎకరాల లక్ష్యం పూర్తయ్యేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలన్నారు. గిరివికాస్‌లో లబ్ధి పొందిన రైతులు పండ్ల మొక్కలు, ఆయిల్‌పామ్ సాగు చేసుకునేలా చూడాలని తెలిపారు. సమావేశంలో ఎంపీఓ ఉపేంద్రయ్య, ఏపీఓ వెంకన్న పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న షీటీమ్ బాధ్యులు

మహదేవపూర్: మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం షీ టీమ్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థినులు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేరగాళ్ల ఉచ్చులోపడి మోసపోవద్దని సూచించారు. మహిళలు, విద్యార్థినులు ఆపద వస్తే వెంటనే 87126 58162 లేదా.. టోల్‌ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేసి సాయం పొందాలని షీ టీమ్ ఎస్సై శ్రీలత తెలిపారు. షీ టీమ్ సభ్యులు దేవేందర్, సాజిద్, నరేష్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

ఫాగింగ్ మిషన్ల మరమ్మతు

కాటారం: వర్షాకాలంలో దోమల వ్యాప్తిని నివారించడం కోసం ఉపయోగించే ఫాగింగ్ మిషన్లకు బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో అధికారులు మరమ్మతు చేయించారు. ఆరు ఫాగింగ్ మిషన్లు గత కొంత కాలంగా చెడిపోయి వినియోగంలోకి రాలేదు. దీంతో ఎంపీడీఓ శంకర్‌నాయక్, ఎంపీఓ ఉపేంద్రయ్య హనుమకొండ నుంచి టెక్నిషియన్లను రప్పించి మిషన్లను రిపేర్ చేయించారు.

అసెంబ్లీలో చర్చించండి



వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

ములుగు: గ్రామ పంచాయతీ కార్మికుల కష్టాలపై అసెంబ్లీలో చర్చించాలని బుధవారం ములుగు ఎమ్మెల్యే డాక్టర్ సీతక్కను కారోబార్లు, బిల్ కలెక్టర్లు, సిబ్బంది కోరారు. ఈ మేరకు సీతక్కకు వినతిపత్రాన్ని అందించారు. స్పందించిన సీతక్క తొలిరోజు సమావేశంలో అవకాశం వస్తే ఖచ్చితంగా మాట్లాడతానని, సీఎం కేసీఆర్‌కు సమస్య అర్థమయ్యేలా వివరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఓరుగంటి రఘు, జితేంద్రచారి, ఆరెందుల సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పెసా గ్రామసభలు

మంగపేట: మండలంలోని వివిధ గ్రామాల్లో ఏ4 మద్యం షాపుల ఏర్పాటు కోసం ఆయా గ్రామాల్లోని పెసా గ్రామ సభల ద్వారా ఓటర్ల అభిప్రాయ సేకరణ కోసం నిర్వహిస్తున్న పెసా గ్రామసభలు బుధవారంతో ముగిశాయి. మండలంలో ఆరు గ్రామాల్లో ఏ4 మద్యం షాపులను ఏర్పాటు చేసేందుకు పెసా గ్రామసభలను ఏర్పాటు చేశారు. మొదటి రోజు మండలంలోని తిమ్మంపేట, మల్లూరు, రామచంద్రునిపేటలో, బుధవారం రెండో రోజు మండల కేంద్రంలోని గంపోనిగూడెం, రాజుపేట, రామచంద్రునిపేటలో ఆయా గ్రామాల ప్రత్యేకాధికారుల అధ్యక్షతన గ్రామసభలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభల ముఖ్య ఉద్దేశాన్ని ఏటూరునాగారం ఐటీడీఏ పెసా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్ ఆదివాసీ గిరిజన ఓటర్లకు వివరించారు. పెసా గ్రామ సభల ద్వారా ఓటర్లు తెలిపిన అభిప్రాయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీఓ శ్రీనివాస్, ప్రత్యేకధికారి రాజు, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి మాలోత్ హీరూ, ఉపేంద్ర, సంపత్ పాల్గొన్నారు.



గంపోనిగూడెంలో చేతులెత్తి అభిప్రాయాన్ని తెలియజేస్తున్న ప్రజలు

సెకండరీ గ్రేడ్ టీచర్లకు శిక్షణ

మంగపేట: మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు మండల ఇన్‌చార్జ్ ఎంఈఓ లకావత్ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో జెడ్పీహెచ్ఎస్ మంగపేటలో నిర్వహించే మూడు దశల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలుగు రెండు రోజులు, ఆంగ్లం రెండు రోజులు, లెక్కలపై రెండు రోజుల పాటు ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమానికి కోర్సు డైరెక్టర్‌గా జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం మేనక, నోడల్ ఆఫీసర్‌గా రవి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. మొదటి రోజు 37 మంది ఉపాధ్యాయులు పాల్గొన్న శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించిన క్వాలిటీ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి, ప్లానింగ్ కోఆర్డినేటర్ అర్శం రాజు ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా తెలుగుకు నాగరాజు, రవి, ఇంగ్లిష్‌కు ప్రవాహ, సురేష్, లెక్కలకు సాంబశివ రావు, రాజేశ్వర్‌రావు వ్యవహరించారు.



మాట్లాడుతున్న ఎంఈఓ రాజేష్‌కుమార్